TELANGANA SHASANA SABHA TELTEL/2016/68867

తెలంగాణ
# శాసనసభ
తెలుగు దినపత్రిక

Published from Hyderabad,Rangareddy,Nalgonda,Mahabubnagar, Khammam,

తెలంగాణ | సంపుటి : 02 | సంచిక : 109 | ఎడిటర్ : పోలగోని రాజేష్ | బుధవారం 25 సెప్టెంబర్ - 2024 | పేజీలు : 8 | వెల : 04/-

## మూడోసారి జెలెన్స్కీతో మోడీ భేటీ..
## రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ఆగుతుందా?



ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ, ప్రధాని మోడీ మూడు నెలల వ్యవధిలో మూడోసారి భేటీ అయ్యారు. అమెరికా పర్యటన నుంచి తిరిగి వస్తుండగా.. సోమవారం న్యూయార్క్‌లో ప్రధాని మోడీ, జెలెన్స్కీ మధ్య సమావేశం జరిగింది.

# తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి ఈడీ కోర్టు భారీ షాక్

## ఓటుకు నోటు కేసులో
## కోర్టుకు హాజరవ్వాల్సిందే !

- ఓటుకు నోటు కేసులో ఈడీ కూడా కేసు నమోదు
- అక్టోబర్ 16న హాజరు కాక తప్పదా?
- నిందితులందరికీ నోటీసులు జారీ
- రూ. యాభై లక్షలు రేవంత్ దగ్గర బ్యాగులో ఉన్నాయి.



శాసనసభ / హైదరాబాద్ :తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఓటుకు నోటు కేసులు చిక్కులు తప్పేలా లేవు.ఈ కేసులో పెద్ద ఎత్తున అక్రమ నగదు చెలామణి జరిగిందని ఈడీ నమోదు చేసిన కేసులో ఆయనకు సమన్లు జారీ అయ్యాయి. వచ్చే నెల పదహారో తేదీన కోర్టు ఎదుట హాజరు కావాల ని రేవంత్ రెడ్డి సహా నిందితులందరికీ నోటీసులు జారీ చేసింది. ఈ కేసులో విచారణకు నిందితులు అందరూ డుమ్మా కొడుతున్నారు. మంగళవారం జరిగిన వాయిదాకు కేవలం మత్తయ్య మాత్రమే హాజరయ్యారు.దీంతో కోర్టు నిందితలందరూ విచారణకు హాజరు కావాలని ఆదేశాలు జారీ చేసింది.

## దేశానికి క్షమాపణ చెప్పాలి:
## వినేశ్ ఫొగాట్‌పై
## యోగేశ్వర్ దత్ విమర్శలు



ఢిల్లీ / శాసనసభ : ప్రధాని మోదీని విమర్శించే వరకు వెళ్లారని ఆగ్రహం పారిస్ ఒలింపిక్స్‌లో అనర్హతకు గురైన వినేశ్ ఫొగాట్ దేశానికి క్షమాపణలు చెప్పాలని లండన్ ఒలింపిక్ విజేత యోగేశ్వర్ దత్ అన్నారు.

వివరాలు »»2లో

## విద్యాశాఖకు మంత్రి లేని ఏకైక రాష్ట్రం తెలంగాణ



- డీఎస్సీ ఫలితాల విడుదలపై జాప్యం
- కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎక్స్ వేదికగా ప్రశ్నించిన బీఆర్ఎస్ నేత
- జూలై 18 నుండి ఆగస్టు 5 వరకు జరిగిన డీఎస్సీ పరీక్షలు
- టీచర్ల అవసరం ఉందంటూ ప్రభుత్వం హడావుడిగా పరీక్షలు నిర్వహించిందన్న ఆర్ఎస్‌పీ

## వరద బాధితులకు నేటి నుంచి పరిహారం చెల్లింపు



ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలకు తీవ్రంగా నష్టపోయిన బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం బుధవారం పరిహారం విడుదల చేస్తోంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజయవాడ కలెక్టరేట్ నుంచి బాధితులకు ఈ పరిహారాన్ని నేరుగా వారి ఖాతాల్లోకే జమ చేయనున్నారు.ఇటీవల కురిసిన వర్షాలు, బుడమేరు వరదలకు విజయవాలోని పలు ప్రాంతాలు ముంపునకు గురై ప్రజలు తీవ్రంగా నష్టపోయారు.

## చెప్పులు వేసుకుని అమ్మవారి దీక్షలా..?
### ఏ సనాతన ధర్మం చెప్పింది



అమరావతి / శాసనసభ : ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సనాతన ధర్మం గురించి చాలా గొప్పగా చెబుతున్నారు.అయితే ఆయన గతంలో పలు సందర్భాల్లో చేసిన పనులకు , ఇప్పుడు మాట్లాడే మాటలకు ఏమాత్రం సంబంధం ఉండటం లేదు.

## "తెరవెనక సిద్ధరామయ్య లేడని అంగీకరించడం కష్టం"..
## ముడా కుంభకోణంలో
## హైకోర్టు కామెంట్స్..



మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ముడా) భూ కుంభకోణంలో కర్ణాటక సీఎం సిద్ధరామయ్యకు షాక్ ఇచ్చింది. ముడా ల్యాండ్ స్కాంలో సీఎంపై గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్ విచారణకు ఆదేశించారు.

## తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంపై సిట్ ఏర్పాటు

తిరుమల లడ్డూ వ్యవహారంపై కల్తీ నెయ్యి వ్యవహారంపై ఏపీ ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. సిట్‌ను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.సిట్ చీఫ్‌గా గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠిని ప్రభుత్వం నియమించింది. సిట్ సభ్యులుగా విశాఖ రేంజ్ డీఐజీ గోపినాథ్‌జెట్టి, కడప ఎస్పీ హర్షవర్ధన్ రాజుతో



పాటు మరికొందరు డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు ఉండనున్నారు. కల్తీ నెయ్యిని తిరుమల లడ్డూ తయారీ వినియోగించారనే నేపథ్యంలో కల్తీ ఎలా సరఫరా అయింది.. ఏ మేరకు సరఫరా అయిందనే విషయాలపై సిట్ విచారణ జరపనున్నట్లు తెలుస్తోంది. ఈ మొత్తం వివాదానికి సంబంధించి కారకులు ఎవరనే విషయంపై సిట్ ఆరా తీయనున్నట్లు సమాచారం.

## ధాన్యం కొనుగోళ్లపై గైడ్ లైన్స్ జారీ చేసిన ప్రభుత్వం



## పుతిన్‌పై బైడెన్ కీలక వ్యాఖ్యలు.. ఉక్రెయిన్‌ను ఏమి చేయలేకపోయారని వ్యాఖ్య



శాసనసభ / న్యూఢిల్లీ : ఉక్రెయిన్, పశ్చిమాసియాల్లో సంక్షోభాలపై అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ కీలక వ్యాఖ్యలు చేశారు. అమెరికా అధ్యక్షుడిగా ఐక్యరాజ్యసమితి సాధారణ సభలో చివరి ప్రసంగం చేశారు.

వివరాలు »»2లో

# టార్గెట్ పేద, మధ్యతరగతి వారే
## హైడ్రాకు చట్టం లేదు, చుట్టరికం మాత్రమే
## సీఎం అన్నకో న్యాయం, గరీబోళ్లకు మరొక న్యాయమా?



శాసనసభ / హైదరాబాద్ : అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఒక్క సీటు కూడా రాలేదన్న ఆలోచనతో, హైదరాబాద్ ప్రజలపై రేవంత్ రెడ్డి పగబట్టారని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. అందుకే పేద, మధ్యతరగతి వారిని టార్గెట్ చేస్తూ బుల్డోజర్లు పంపుతున్నారని ఆయన విమర్శించారు. ముఖ్యమంత్రి సోదరుడు తిరుపతి రెడ్డికి ఒక న్యాయం, పేదలకు మరొక న్యాయమా అంటూ ధ్వజమెత్తారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఒక్క సీటు కూడా రాలేదన్న ఆలోచనతో హైదరాబాద్ ప్రజలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పగబట్టారని, అందుకే పేదలు, మధ్యతరగతి వారిని టార్గెట్ చేసి బుల్డోజర్లు పంపుతున్నారని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో శేరిలింగంపల్లి నియోజకవర్గ నేతల సమావేశంలో కేటీఆర్‌తో పాటు మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యేలు మాగంటి గోపీనాథ్, మాధవరం కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.ముఖ్యమంత్రి సోదరుడు తిరుపతి రెడ్డికి ఒక న్యాయం, పేదలకు మరొక న్యాయమా అని ప్రశ్నించిన కేటీఆర్, ఎన్ కన్వెన్షన్‌కు తమ హయాంలో నోటీసులిస్తే నాగార్జున హైకోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్నారని గుర్తు చేశారు. హైదరాబాద్ అయ్యప్ప సొసైటీలో తిరుపతి రెడ్డి టాక్స్ నడుస్తోందని, అది సెటిల్మెంట్‌ల అడ్డా అని అరికెపూడి గాంధీ తనకు చెప్పారని కేటీఆర్ తెలిపారు.

వివరాలు »»2లో

శాసనసభ
తెలుగు దినపత్రిక
బుధవారం 25 సెప్టెంబర్ - 2024

( మొదటి పేజీ తరువాయి )

## చెప్పులు వేసుకుని అమ్మవారి దీక్షలా..? ఏ సనాతన ధర్మం చెప్పింది బాసూ



ఎన్నికల ఫలితాల తర్వాత పవన్ కల్యాణ్ వారాహి అమ్మవారి దీక్ష చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ దీక్ష 11 రోజుల పాటు కొనసాగనుంది. వారాహి అమ్మవారి దీక్షకు సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.పద్ధతిగా నుదుట బొట్టు, పసుపు రంగు అమ్మవారి బట్టల్లో కనిపించి పవన్ అందర్నీ ఆకట్టుకున్నారు అయితే వారాహి అమ్మవారి దీక్ష చేస్తోన్న పవన్ కల్యాణ్ చెప్పులు ధరించి కనిపించారు. పవన్ కల్యాణ్ చెప్పులు ధరించి దీక్ష చేయడం హిందువులను కించ పరచడమనే అభిప్రాయం అప్పట్లోనే వ్యక్తం అయింది. ఎన్నికల సమయంలో హిందూమతం గురించి గొప్పగా చెప్పిన పవన్ కల్యాణ్‌కు చెప్పులు వేసుకుని దీక్ష చేయకూడదనే విషయం కూడా తెలియకపోవడం ఆయన అవివేకానికి నిదర్శనం పవన్‌పై నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేశారు.గతంలో కూడా పవన్ కల్యాణ్ దీక్షలు చేసినప్పుడు చెప్పులు ధరించారు. ఎన్నికల ముందు అభిమాని ఇచ్చిన వెంకటేశ్వరస్వామి ఫొటోను చెప్పులు వేసుకునే అందుకున్న వీడియో అప్పట్లో బాగానే వైరల్ అయింది. ఎన్నికల సమయంలో ముస్లిం సోదరులతో భేటీ అయిన సమయంలో పవన్ వారికి అనుకూలంగా మాట్లాడిన వీడియోలు సైతం ఇప్పుడు తెగ వైరల్ అవుతున్నాయి. వారి ఆహార అలవాట్ల గురించి పవన్ అప్పట్లో కీలక వ్యాఖ్యలు కూడా చేశారు. ఇప్పుడు మాత్రం సనాతన ధర్మం అంటూ వేదాలు వల్లిస్తున్నారంటూ నెటిజన్లు ఆయన్ను ట్రోల్ చేస్తున్నారు. బీజేపీని మెప్పించడానికే పవన్ ఇలా సనతన ధర్మం గురించి చెబుతున్నారనే అభిప్రాయం కూడా వ్యక్తం అవుతోంది.

### తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి ఈడీ కోర్టు భారీ షాక్ - ఓటుకు నోటు కేసులో ఆ తేదీన కోర్టుకు హాజరవ్వాల్సిందే !

ఓటుకు నోటు కేసులో ఈడీ కూడా కేసు నమోదు ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థికి ఓటు వేయాలని కోరుతూ తెలగుదేశం పార్టీలో ఉన్నప్పుడు నామినేటెడ్ ఎమ్మెల్సీగా ఉన్న స్టీఫెన్సర్కు డబ్బులు ఎర చూపారని తెలంగాణ ఏసీబీ కేసు నమోదు చేసింది. ఆ కేసులో ఆయన చాలా రోజు పాటు జైల్లో ఉండి బెయిల్ తెచ్చుకున్నారు. అలా డబ్బులు ఎర చూపిన సమయంలో రూ. యాభై లక్షలు రేవంత్ దగ్గర బ్యాగులో ఉన్నాయి. దీంతో నగదు అక్రమ చెలామణి చేశారని ఏసీబీ ఈడీకి కేసు రిఫర్ చేసింది. ఈ అంశంపై ఈడీ కూడా కేసు నమోదు చేసింది. ఏసీబీ నోదు చేసిన కేసులో విచారణ జరుగుతోంది. రేవంత్ రెడ్డి సీఎం అయినందున ఆ కేసును ఇతర రాష్ట్రాలకు బదిలీ చేయాలని బీఆర్ఎస్ నేత జగదీష్ రెడ్డి వేసిన పిటిషన్ ను ఇటీవల సుప్రీంకోర్టు తిరస్కరించింది. అయితే ఈ కేసు దర్యాప్తు, విచారణ విషయంలో రేవంత్ రెడ్డి జోక్యం చేసుకోకూడదని స్పష్టం చేసింది.నిందితులు హాజరు కాకపోతూండటంతో విచారణ ఆలస్యం ఇదే కేసులలో ఈడీ దాఖలు చేసిన కేసులో విచారణ నెమ్మదిగా సాగుతోంది. కోర్టుకు నిందితులు సరిగ్గా హాజరు కావడం లేదు. ఈ కేసులో మధ్యవర్తిగా వ్యవహరించారని ఆరోపణలు ఎదుర్కొంటున్న క్రైస్తవ మత ప్రచారకర్త జెరూసలేం మత్తయ్య మాత్రం అటు ఏసీబీ కేసులోనూ.. ఇటు ఈడీ కేసులోనూ రెగ్యులర్ కోర్టుకు హాజరవుతున్నారు. ఇతరులు ఎవరూ హాజరు కాకుండా..హాజరు మినహాయింపు పిటిషన్లు దాఖలు చేస్తున్నారు. దీంతో కోర్టు వచ్చే నెల పదహారో తేదీన నిందితులు అందరూ కోర్టుకు హాజరు కావాలని ఆదేశించింది.అక్టోబర్ 16న హాజరు కాక తప్పదా?ప్రస్తుతం రేవంత్ రెడ్డి సీఎం పొజిషన్లో ఉన్నందున కోర్టుకు హాజరవుతారా లేదా అన్న దానిపై సస్పెన్స్ నెలకొంది. ఆయన తరపున లాయర్ హాజరయ్యేలా ఈడీ కోర్టులోనో లేకపోతే హైకోర్టులోనే పిటిషన్ వేసే ఆలోచన చేస్తున్నట్లుగా ఉంది. గతంలో ఏపీ సీఎంగా జగన్మోహన్ రెడ్డి ఉన్నప్పుడు ఆయనపై నమోదైన సీబీఐ, ఈడీ కేసుల్లో కూడా కోర్టుకు హాజరు కాలేదు. సీఎం బాధ్యతల కారణంగా ఆయన మినహాయింపు కోరుకున్నారు.

## మూడోసారి జెలెన్స్కీతో మోడీ భేటి.. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ఆగుతుందా?



ఈ విషయంపై తాను చాలా మంది ప్రపంచ నాయకులతో మాట్లాడానని.. యుద్ధాన్ని ముగించడానికి ఏదో ఒక మార్గాన్ని కనుగొనవలసి ఉందని అందరూ అంగీకరించారని మోడీ జెలెన్స్కీకి చెప్పినట్లు తెలిపారు. ఇందుకోసం తమ ప్రయత్నాలు కూడా కొనసాగుతున్నాయన్నారు.ఉక్రెయిన్ అభ్యర్థనపై జెలెన్స్కీతో భేటీ అనంతరం విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ మాట్లాడుతూ.. ఉక్రెయిన్ కోరిక మేరకు ఈ సమావేశం జరిగిందని చెప్పారు. మోడీ గత నెలలో కీవ్‌లో ఉక్రెయిన్ నాయకుడిని కలిశారు. దానికి కొన్ని వారాల ముందు జూలైలో, ప్రధానమంత్రి రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌ను మాస్కోలో కలిశారు. చర్చలు, దౌత్యం ద్వారా శాంతికి మార్గాన్ని కనుగొనేందుకు ఎప్పుడూ మా మద్దతు ఉంటుందని మిస్రీ తెలిపారు.జెలెన్స్కీతో జరిగిన సమావేశంలో కూడా తాను ఎప్పుడూ శాంతి, శాంతి మార్గంలో నడవడం గురించే మాట్లాడినట్లు విక్రమ్ మిస్రీ చెప్పారు. ఈ రెండు అంశాలు పరస్పరం ముడిపడి ఉన్నందున శాంతి లేకపోతే సుస్థిరమైన అభివృద్ధి ఉండదని స్పష్టమవుతోందని మిస్రీ అన్నారు. వివాదాన్ని ముగించే మార్గాన్ని కనుగొనడంపై అందరి ప్రయత్నాలు కేంద్రీకృతమై ఉన్నందున యుద్ధం ముగుస్తుందో లేదో కాలమే చెబుతుందన్నారు. రష్యా చమురు దిగుమతులు తన యుద్ధ ప్రయత్నాలను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ఉద్దేశించినవి కాదన్న భారత్ వాదనను అంగీకరించారా అని అడిగిన ప్రశ్నకు.. మిస్రీ స్పందిస్తూ.. నేటి చర్చల్లో ఆ అంశం ప్రస్తావనకు రాలేదన్నారు.మోడీ అమెరికా పర్యటన ముగిసిన అనంతరం ఆయన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్‌లో ఓ పోస్ట్ చేశారు. తాను ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీని కలిశానని రాశారు. ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసేందుకు గత నెలలో నా ఉక్రెయిన్ పర్యటన ఫలితాలను అమలు చేయడానికి తాము కట్టుబడి ఉన్నామన్నారు. గత నెలలో కీవ్‌లో తన పర్యటన, ద్వైపాక్షిక అంశాలు, రష్యా-ఉక్రెయిన్ వివాదానికి సంబంధించిన అన్ని విషయాలపై జరిపిన చర్చలను మోడీ ప్రస్తావించారు.

( మొదటి పేజీ తరువాయి )

## హైడ్రాకు చట్టం లేదు, చుట్టరికం మాత్రమే



హైడ్రాకు చట్టం లేదు, చుట్టరికం మాత్రమే : రేవంత్ రెడ్డి చిట్టినాయుడు అయితే ఆయనకు ఏడుగురు సోదరులు అన్న కేటీఆర్, పొంగులేటి, పట్నం మహేందర్ రెడ్డి సహా కాంగ్రెస్ నేతల ఫాంహౌస్‌లు ఎందుకు కూల్చలేదని ప్రశ్నించారు. హైడ్రాతో గూడు కోల్పోయిన పేదలకు 40వేల డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. హైడ్రాకు చట్టం లేదని, చుట్టరికం మాత్రమే ఉందని కేటీఆర్ అన్నారు. అక్రమాలన్నీ తవ్వితే బయటకు వచ్చేది కాంగ్రెస్ నేతల కుంభకోణాలు, లంబకోణాలే అని పేర్కొన్నారు. పేదల ఇండ్లు కూలుస్తున్నారు కానీ వారికి అనుమతులు ఇచ్చిన వారిపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని కేటీఆర్ అడిగారు.శేరిలింగంపల్లిలో ఉపఎన్నిక రావడం ఖాయం : రైతు భరోసా కాదు ముఖ్యమంత్రి కుర్చీకే భరోసా లేదన్న ఆయన, నల్గొండ బాంబా, ఖమ్మం బాంబా అన్న భయంతో తొమ్మిది నెలలుగా రేవంత్ రెడ్డి ఉన్నారని ఎద్దేవా చేశారు. మంత్రి శ్రీధర్ బాబు అతి తెలివితో మాట్లాడుతున్నారని, అరికెపూడి గాంధీ బీఆర్ఎస్‌లోనే ఉంటే కాంగ్రెస్ కండువా కప్పిన సన్నాసి ఎవరని కేటీఆర్ ఘాటుగా వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఇళ్లకు వెళ్లి కాళ్లు మొక్కి కండువాలు కప్పిన దౌర్భాగ్యులు ఎవరని ప్రశ్నించారు. శేరిలింగంపల్లిలో ఉపఎన్నిక రావడం ఖాయమని, పార్టీని మోసం చేసిన వారికి మనమంతా బుద్ధి చెప్పాల్సిందేనని అన్నారు.పార్టీ మారిన ఎమ్మెల్యేలు తమ వాళ్లేనని సీఎం ధైర్యంగా ఎందుకు చెప్పడం లేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్‌ను వీడిన ఎమ్మెల్యేల బతుకు జూబ్లీ బస్టాండ్ అయిందన్న కేటీఆర్, డైవర్షన్ పాలిటిక్స్‌తో ఎక్కువ కాలం రాజకీయాలు నడవవని అన్నారు. కేసీఆర్ విలువ ఏమిటో ప్రజలకు ఇప్పుడిప్పుడే తెలుస్తోందని, ఎక్కడ పోయి ఎవరిని కదిలించినా అయ్యో తప్పు చేసి కేసీఆర్‌ను ఓడగొట్టుకున్నామన్న వేదన వినిపిస్తోందని మాజీమంత్రి సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. కేసీఆర్ హయాంలో రోజూ ఎక్కడో ఒక శంకుస్థాపన, ప్రారంభోత్సవం ఉండేదని, ఇప్పుడు 9 నెలలు దాటినా ఎక్కడా అభివృద్ధి ఊసేలేదని అన్నారు.సీవీసీ స్వతంత్ర సంస్థ.. దానికి మీ సిఫార్సు దేనికి? : మరోవైపు కేంద్రమంత్రి బండి సంజయ్ వ్యాఖ్యలపై స్పందించిన కేటీఆర్, దొంగలు పడ్డ ఆరు నెలలకి కుక్కలు మొరిగినట్లు ఉందని మండిపడ్డారు. అమృత్ టెండర్ల వ్యవహారంలో కేంద్ర మంత్రి చేసిన వ్యాఖ్యలపై ఎక్స్ వేదికగా కేటీఆర్ స్పందించారు. బండి సంజయ్ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి అన్న విషయం మర్చిపోయినట్లు ఉన్నారన్న ఆయన, కేంద్ర పథకమైన అమృత్‌లో అవినీతి జరిగిందని మొదటగా బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి చెప్పారని గుర్తు చేశారు.అయినా పాలు తాగుతున్న దొంగ పిల్లిలా కన్వీనియంట్‌గా కళ్లు మూసుకున్నారని కేటీఆర్ ఆక్షేపించారు. వ్యవహారం మొత్తాన్ని ఆధారాలతో బయట పెట్టాక ఈ చిల్లర మాటలు దేనికని ప్రశ్నించారు. స్వతంత్ర సంస్థ అయిన కేంద్ర విజిలెన్స్ కమిషన్‌కు బండి సంజయ్ సిఫార్సు ఎందుకని అన్నారు. అయినా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీజేపీ మధ్య అజబ్ ప్రేమ్ కీ గజబ్ కహానీ అందరూ గమనిస్తూనే ఉన్నారని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

## దేశానికి క్షమాపణ చెప్పాలి: వినేశ్ ఫొగాట్‌పై యోగేశ్వర్ దత్ విమర్శలు



ఒలింపిక్స్‌లో అధిక బరువు కారణంగా ఫొగాట్‌పై అనర్హత వేటు పడింది. ఆమెకు యావత్ భారత్ అండగా నిలిచింది. ఆ తర్వాత ఆమె కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ క్రమంలో యోగేశ్వర్ దత్ కీలక వ్యాఖ్యలు చేశారు.పారిస్ ఒలింపిక్స్ అనర్హత వేటుకు సంబంధించి వినేశ్ ఫొగాట్ బాధ్యత తీసుకోవాల్సింది అన్నారు. బాధ్యత తీసుకోకపోగా తన అనర్హతకు ఇతరులపై నిందలు వేయడం సరికాదన్నారు. తాను కనుక ఇలా అనర్హతకు గురైె ఉంటే దేశానికి క్షమాపణలు చెప్పేవాడినన్నారు. పారిస్ ఒలింపిక్స్ తర్వాత ఆమె వ్యవహరించిన తీరు పట్ల యోగేశ్వర్ అసంతృప్తి వ్యక్తం చేశారు.ఒలింపిక్స్ విషయంలో తనపై కుట్ర జరిగిందన్న ఆమె వార్తలు తనకు ఆశ్చర్యం కలిగించాయన్నారు. ఈ ఘటనపై ప్రధాని మోదీని విమర్శించే వరకు కూడా వెళ్లారని మండిపడ్డారు. గ్రాము కంటే కాస్త ఎక్కువగా ఉన్నా అనర్హత వేటు వేస్తారనే విషయం ప్రతి ఆటగాడికి తెలుసునన్నారు. ఫైనల్‌కు వెళ్లిన సమయంలో ఆమెకు దేశం మద్దతుగా నిలిచిందన్నారు.

## వరద బాధితులకు నేటి నుంచి పరిహారం చెల్లింపు



మొత్తం 16 జిల్లాల్లో ఆస్తులకు, పంటలకు నష్టం జరిగింది. విజయవాడ మునుపెన్నడూ చూడని వరదలకు అతలాకుతలం అయ్యింది.దీంతో 10 రోజులు పాటు విజయవాడ కలెక్టరేట్‌నే సీఎం సచివాలయంగా మార్చుకుని యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు అందేలా యంత్రాన్ని చంద్రబాబు నడిపించారు. అలాగే నష్టపోయిన బాధితులకు నష్టపరిహారం అందజేయడానికి ప్రభుత్వం ఎన్యుమరేషన్ పూర్తి చేసింది. బాధితులకు నష్ట పరిహారం ప్యాకేజీని సీఎం చంద్రబాబు నాయుడు ఇప్పటికే ప్రకటించారు. ఈ ప్యాకేజీ ప్రకారం వరదల్లో నష్టపోయిన బాధితులకు పరిహారాన్ని ముఖ్యమంత్రి రేపు విడుదల చేయనున్నారు. అర్హులైన బాధితులందరికీ నేరుగా వారి ఖాతాల్లోనే ప్రభుత్వం పరిహారం డబ్బులు జమ చేయనుంది. వరదల్లో నష్టపోయిన వాహనాలకు బీమా చెల్లింపు కార్యక్రమం కూడా ఈ నెలాఖరులోపు పూర్తి చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

# ధాన్యం కొనుగోళ్లపై గైడ్ లైన్స్ జారీ చేసిన ప్రభుత్వం



రాష్ట్రంలో 2024-25 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోళ్లపై ఏపీ ప్రభుత్వం గైడ్ లైన్స్ జారీ చేసింది. వికేంద్రీకరణ విధానంలో ధాన్యం కొనుగోళ్లకు సర్కారు మార్గదర్శకాలు జారీ చేసింది.రైతు సేవా కేంద్రాలు, ధాన్యం సేకరణ కేంద్రాల ద్వారా కొనుగోళ్లు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలోని ఇ-పంట, ఈ కేవై సీ ద్వారా రైతులు, కౌలు రైతు వివరాలతో ధాన్యం కొనుగోళ్లకు ఆదేశాలు జారీ అయ్యాయి. ఆధార్ అనుసంధానంతో ఇ-పంట , ఇ-కేవై సీ ద్వారా రైతుల ఖాతాల్లోకి ధాన్యం కొనుగోళ్లకు సంబంధించిన చెల్లింపులు చేయాలని ప్రభుత్వ ఆదేశించింది.ఏపీ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ, ఏపీ మార్క్ ఫెడ్ సంస్థలు రాష్ట్రస్థాయి ధాన్యం కొనుగోళ్లకు నోడల్ సంస్థలుగా పనిచేస్తాయని స్పష్టం చేస్తూ జీవో జారీ చేసింది. ధాన్యం కొనుగోలు లావాదేవీల్లో ఉన్న రైస్ మిల్లర్లు కూడా ప్యాడీ ప్రొక్యూర్‌మెంట్ పోర్టల్ లో నమోదు కావాలని జీవోలో ప్రభుత్వం పేర్కొంది. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన కనీస మద్ధతు ధర కామన్ వెరైటీ క్వింటాలుకు రూ.2300 , గ్రేడ్ ఏ రకానికి రూ.2320 క్వింటాలుకు చెల్లించాలని స్పష్టం చేసింది. 2024-25 ఖరీఫ్ సీజన్ కు 37 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా నిర్దేశించుకున్నట్టు సర్కార్ స్పష్టం చేసింది. సేకరణ సహా, మిల్లింగ్ ఆపరేషన్లను పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్లు, జేసీలను ఆదేశిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

## విద్యాశాఖకు మంత్రి లేని ఏకైక రాష్ట్రం తెలంగాణ: ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్



రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం డీఎస్సీ ఫలితాల విడుదలపై చేస్తున్న జాప్యం విషయమై బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా ప్రశ్నించారు. అసలు ఈ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి వర్యులు ఎవరు...? ఆయన ఏ ప్రపంచంలో సేదతీరుతున్నారు..? విద్యాశాఖ మంత్రి లేని ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమే ఫైర్ అయ్యారు.ఉపాధ్యాయుల అవసరం ఉందంటూ హడావుడిగా పరీక్షలు నిర్వహించిన ప్రభుత్వం.. ఇప్పుడు ఫలితాలు ఎందుకు విడుదల చేయడం లేదని నిలదీశారు. తెలంగాణ ప్రభుత్వం ఆగమేఘాల మీద డీఎస్సీ పరీక్షలు జూలై 18 నుండి ఆగస్టు 5 వరకు ఆన్‌లైన్ (సీబీటీ) లో నిర్వహించిందని, చాలా మంది అభ్యర్థులు వాయిదా వేయాలని వేడుకున్నా పట్టించుకోలేదని విమర్శించారు. తొందరగా టీచర్ల అవసరముందని ప్రభుత్వం హడావుడిగా పరీక్షలు నిర్వహించిందని ఆరోపించారు. అంతా ఆన్‌లైన్ పరీక్ష అయినప్పుడు దీనికి సంబంధించిన నియామక భర్తీ ప్రక్రియ ఎందుకు నత్త నడకన సాగుతోంది అని ప్రవీణ్ కుమార్ ప్రశ్నించారు. అభ్యర్థులకు ఫలితాలు తొందరగా ఇచ్చి, జనరల్ ర్యాంకింగ్స్ ప్రకటించి, నియామక పత్రాలు అందజేస్తే వారు త్వరగా బడులకు వెళ్లి పిల్లలకు పాఠాలు బోధిస్తారని ఆయన తెలిపారు. వారం రోజుల్లో డీఎస్సీ ఫలితాలు విడుదల చేస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్పారని, అలాగే సెప్టెంబర్ 5వ తేదీ వరకు నియామకాలు చేపడుతామని కూడా హామీ ఇచ్చారని... కానీ అమలుకు నోచుకోవడం లేదని ప్రవీణ్ కుమార్ మండిపడ్డారు. రాష్ట్ర ఖజానాలోని సొమ్మును కొడంగల్, ఢిల్లీకి తరలించినట్లు అనిపిస్తుందని పేర్కొన్నారు. అందుకే జీతాలకు డబ్బుల్లేక, గురుకుల టీచర్లకే ఐదు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదని దుయ్యబట్టారు. ఇక డీఎస్సీ టీచర్లకు ఎక్కడ్నుంచి తీసుకొచ్చి ఇవ్వాలనే ధోరణిలో ప్రభుత్వం ఉందన్నారు. హైడ్రా పేరుతో అందరి దృష్టి మళ్లించి, వచ్చే ఏడాది నియామక పత్రాలు ఇవ్వాలని కాంగ్రెస్ సర్కార్ కుట్ర చేస్తున్నట్లు అనిపిస్తుందని ఆయన తెలిపారు.

## పుతిన్‌పై బైడెన్ కీలక వ్యాఖ్యలు.. ఉక్రెయిన్‌ను ఏమి చేయలేకపోయారని వ్యాఖ్య



ఉక్రెయిన్‌కు అమెరికాతో పాటు పాశ్చాత్య దేశాలు అండగా నిలిచియాయని తెలిపారు. ఉక్రెయిన్‌పై రష్యా అధ్యక్షుడు పుతిన్ జరిపిన యుద్ధం విఫలమైందని వ్యాఖ్యానించారు. ఇక పశ్చిమాసియా సంక్షోభంతో పాటు సుడాన్‌లో 17 నెలలుగా కొనసాగుతున్న అంతర్యుద్ధానికి ముగింపు పలకాల్సిన అవసరం ఉందన్నారు. దేశాల మధ్య పెరుగుతున్న విభేదాలను అంతం చేస్తామని ప్రకటించారు. అలాగే దుందుడుకు చర్యలకు వ్యతిరేకంగా దృఢంగా నిలబడతామని పేర్కొన్నారు. ఉక్రెయిన్‌పై రష్యా దండయాత్ర ప్రారంభించినప్పుడు.. నాటో మిత్రదేశాలు, ఇతర భాగస్వాములు ఇలా 50కి పైగా దేశాలు కలిసికట్టుగా అండగా నిలిచినట్లు గుర్తుచేశారు. ఈ పరిణామాలు కారణంగానే పుతిన్ యుద్ధం విఫలమైందన్నారు. ఉక్రెయిన్ ఇప్పుడు స్వేచ్ఛగా ఉందని తెలిపారు. నాటోను కూడా బలహీనపరిచేందుకు పుతిన్ యత్నించారని.. కానీ అది సాధ్యం కాలేదన్నారు. ఫిన్లాండ్, స్వీడన్ కొత్తగా వచ్చి చేరడంతో నాటో మరింత బలపడిందని బైడెన్ స్పష్టం చేశారు.

## "తెరవెనక సిద్ధరామయ్య లేడని అంగీకరించడం కష్టం".. ముడా కుంభకోణంలో హైకోర్టు కామెంట్స్..




అయితే, దీనిని సవాల్ చేస్తూ సిద్ధరామయ్య కర్ణాటక హైకోర్టును ఆశ్రయించారు. తాజాగా ఈ రోజు దీనిపై న్యాయమూర్తి జస్టిస్ నాగ ప్రసన్నతో కూడిన ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. "గవర్నర్ స్వతంత్రంగా వ్యవహరించారని, వాస్తవాలు వెలుగులోకి రావాలి" అని, సిద్ధరామయ్య పిటిషన్‌ని కొట్టేస్తున్నట్లుగా తీర్పు చెప్పారు.దీంతో సీఎంపై అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 17ఎ మరియు భారతీయ నాగరిక్ సురక్షా సంహితలోని సెక్షన్ 218 కింద తనపై దర్యాప్తునకు మార్గం సుగమమైంది. మూడా భూముల లావాదేవీల్లో సిద్ధరామయ్య "తెర వెనక"లేదని, అతడి కుటుంబానికి సుమారుగా రూ. 56 కోట్ల మేర లబ్ధి చేకూరిందనే విషయాన్ని అంగీకరించడం కష్టమని జస్టిస్ నాగ ప్రసన్న తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. "రూ. 3.56 లక్షలగా నిర్ణయించిన పరిహారం, లబ్ధిదారుడికి రూ.56 కోట్లుగా మారడం అంగీకరించలేమని, ముఖ్యమంత్రి కుటుంబ సభ్యులకు ఎందుకు, ఎలా నిబంధన మారింది. దీనిని దర్యాప్తు చేయాలి" అని న్యాయమూర్తి అన్నారు.మైసూర్ నగరాభివృద్ధిలో భాగంగా ముఖ్యమంత్రి భార్య పార్వతి నుంచి భూమి సేకరించిన ప్రభుత్వం, ఆమె భూమి కోల్పోయిన ప్రాంతంలో కాకుండా మైసూరు నగరంలోని అత్యంత ఖరీదైన ప్రాంతంలో 14 స్థలాలను కేటాయించం వివాదాస్పదమైంది. దీనిపై ముగ్గురు ఆర్టీఐ యాక్టవిస్ట్‌లు గవర్నర్‌కి పిటిషన్ సమర్పించారు. దీని ఆధారంగా సీఎం సిద్ధరామయ్యపై విచారణకు గవర్నర్ ఆమోదం తెలిపారు. గవర్నర్ ఉత్తర్వులు చట్టబద్ధమైన ఆదేశాలను ఉల్లంఘించిందని, భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 163 ప్రకారం మంత్రి మండలి సలహాతో సహా రాజ్యాంగ సూత్రాలను ఉల్లంఘించిందని సిద్ధరామయ్య కోర్టు ముందు వాదించారు.

# సున్నిత అంశంపై నిర్లిప్తంగా ఉంటే ఎలా?




**అమరావతి / శాసనసభ :** ఏపీకి ప్రత్యేక హోదా ఇచ్చేలా ఆదేశాలు ఇవ్వాలని వేసిన పిల్ విచారణ సమయంలో డిప్యూటీ సొలిసిటర్ జనరల్(డీఎసజీ), రాష్ట్ర ప్రభుత్వ న్యాయవాది అందుబాటులో లేకపోవడంపై ధర్మాసనం అసంతృప్తి వ్యక్తం చేసింది. సున్నితమైన అంశంలో ఇంత నిర్లిప్తంగా ఉంటే ఎలా? అని ప్రశ్నించింది. ప్రత్యేక హోదా కోరు తూ సుప్రీంకోర్టు, హైకోర్టులో దాఖలైన వ్యాజ్యాల స్థితి గురించి ఆరా తీసింది. వివరాలు తెలుసుకొని కోర్టుకు నివేదించాలని న్యాయవాదులకు సూచించింది. ప్రస్తు త పిల్‌తో పాటు ఇదే వ్యవహారంపై దాఖలైన వ్యా జ్యాలను ఏ బెంచ్ విచారించాలనే అంశంపై నిర్ణయం తీసుకొనేందుకు వీలుగా వీటన్నింటినీ సీజే ముందు ఉంచాలని రిజిస్ట్రీని ఆదేశించింది. విచారణను దసరా సెలవుల తరువాతకు వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి.నరేందర్, జస్టిస్ మండవ కిరణ్మయితో కూడిన ధర్మాసనం మంగళవారం ఉత్తర్వులిచ్చింది. ఏపీకి ప్రత్యేక హోదా ఇచ్చేలా కేంద్రాన్ని ఆదేశించాలని కోరుతూ ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. రాష్ట్ర ఆర్థిక పునరుజ్జీవానికి ఆర్థిక సహాయం, ఇతర అవసరమైన సహకారం అందించేలా ఆదేశాలు ఇవ్వాలని అభ్యర్థించారు. రాష్ట్రంలో పరిశ్రమలు నెలకొల్పేందుకు ముం దుకు వచ్చేవారికి పన్ను మినహాయింపులు ఇచ్చేలా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ఈ పిల్ మంగళవారం మరోసారి విచారణకు రాగా పార్టీ ఇన్ పర్సన్ కేఏ పాల్ వాదనలు వినిపిస్తూ... రాష్ట్ర పునర్విభజన సమయంలో రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తామని పార్లమెంట్ వేదికగా హామీ ఇచ్చి అమలు చేయడం లేదన్నారు. రాష్ట్రం లక్షల కోట్ల అప్పుల్లో ఉందన్నారు. ప్రత్యేక హోదా ప్రకటించడం వల్ల పరిశ్రమలు నెలకొల్పేందుకు ప్రోత్సాహకంగా ఉంటుందన్నారు. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. ఇప్పటికే 11 రాష్ట్రాలకు ప్రత్యేక హోదా ఇచ్చారన్నారు. ఏపీ విషయంలో మాత్రం వెనకాడుతున్నారన్నారు. ధర్మాసనం స్పంది స్తూ పార్లమెంట్, అసెంబ్లీ వేదికగా చేసే ప్రకటనలపై న్యాయ సమీక్ష జరపడం సాధ్యపడదని వ్యాఖ్యానించింది. అభ్యంతరం ఉంటే పార్లమెంట్ ప్రివిలేజ్ కమిటీలకు ఫిర్యాదు చేయాలని సూచించింది. న్యాయస్థానాలు ఆర్థిక విధానాలు రూపకల్పనకు ఆదేశాలు ఇవ్వగలవా అనే విషయంపై అధ్యయనం చేసి వాదనలు వినిపించాలని పాల్‌కు స్పష్టం చేసింది.

# ఎడమ కాల్వ గండ్ల పాపం గత ప్రభుత్వానిదే



**సూర్యాపేట / శాసనసభ :** నాగార్జున సాగర్ ఎడమ కాల్వ గండ్లకు గత ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు.మంగళవారం సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలం కాగిత రామ చంద్రాపురం వద్ద సాగర్ ఎడమ కాల్వ గండ్ల మరమ్మతు పనులను కోదాడ ఎమ్మెల్యే పద్మావతితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కాల్వలకు, చెరువులకు గండ్లు గత పదే ళ్ల ప్రభుత్వ పాలన నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆరోపించారు. నీటిపారుదల శాఖను బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్వీర్యం చేయడమే కాకుండా నిందలు మోపడం సరైంది కాదన్నారు. వరదలపై రాజకీయ బురద చల్లొద్దని హితవుపలికారు. లష్కర్లు సహా ఇంజనీర్ల నియామకాలు చేపట్టి ఉంటే ఇలాంటి ఘటనలు జరిగేవి కావన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే 700 మంది ఏఈఈలను నియమించిన విషయాన్ని గుర్తుచేశారు. త్వరలో 1800 మంది లష్కర్ల నియామకాలు చేస్తామన్నారు. 50 ఏళ్ల అనంతరం జిల్లాలోని కోదాడ, హుజూర్‌నగర్‌లో అతిపెద్ద విపత్తు సంభవించిందన్నారు. వెంటనే నష్ట నివారణ చర్యలు చేపట్టామని తెలిపారు. జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో పంట పొలాల్లో చేరిన నీటిని తొలగించేందుకు ఆదేశాలు ఇచ్చామన్నారు. కాగా ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంలో పాలేరు నుంచి వెళ్లే సాగర్ ఎడమకాల్వ గండ్ల మరమ్మతులు పూర్తయ్యాయి. 23 రోజుల తర్వాతఇరిగేషన్ అధికారులు గండి పూడ్చివేత పనులు పూర్తిచేశారు. దీంతో మంగళవారం తెల్లవారుజామున జిల్లాలోని సాగర్ రెండోజోన్ ఆయకట్టుకు నీరు విడుదల చేశారు. మొదట 500 క్యూసెక్కులు వదిలిన అధికారులు క్రమేపీ నీటివిడుదల 2000 కూసెక్కులకు పెంచారు. ఎడమకాల్వకు నీరు విడుదల చేయడంతో పాలేరు జలాశయం వద్ద నీటి ప్రవాహాన్ని మంత్రి పొంగులేటి పరిశీలించారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ అధికారులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. నీటి విడుదలను పెంచాలని ఆదేశించారు. మరమ్మతులు చేసినచోట కాల్వకట్ట ఎత్తు తక్కువగా ఉండటంతో నీటి విడుదల పెంచిన పక్షంలో మళ్లీ ఇబ్బందులు తలెత్తుతాయని, వెంటనే కట్ట ఎత్తు పెంచాలని మంత్రి ఆదేశించారు.సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలం కాగితరామచంద్రాపురం సమీపంలో నాగార్జునసాగర్ ఎడమకాల్వకు ఈ నెల 1వ తేదీన గండి పడటంతో మరమ్మతుల కోసం ప్రభుత్వం రూ.2.10కోట్ల నిధులు విడుదల చేసింది. దీంతో సాగర్ ఎడమకాల్వకు నీటి విడుదలను నిలిపివేసి గండి పూడ్చివేత పనులు నిర్వహిస్తుండగా, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పనులను పర్యవేక్షిస్తున్నారు. మంగళవారం సాయంత్రానికి మరమ్మతు పనులు పూర్తయ్యాయి. బుధవారం సాగర్ ఎడమకాల్వకు నీటిని విడుదల చేయనున్నట్లు మంత్రి ఉత్తమ్ తెలిపారు.

# ట్రిపుల్ ఆర్ బాధితుల పక్షాన పోరాడుతం ఎన్నికల్లో చేసిన వాగ్దానాలను సర్కార్ అమలు చేయాలి



**శాసనసభ /హైదరాబాద్ :** 'ట్రిపుల్ ఆర్ బాధితులు, రైతులు అధైర్య పడొద్దు.. బీఆర్ఎస్ అండగా ఉంటది..ప్రభుత్వం దిగిరాకుంటే పార్టీ తరపున పోరాడుతం' అంటూ మాజీ మంత్రి హరీశ్‌రావు స్పష్టంచేశారు. ట్రిపుల్ ఆర్ బాధితులు, రైతులు హరీశ్‌రావును మంగళవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో కలిసి గోడు వెళ్ల బోసుకున్నారు. ఎన్నికల ముందు న్యాయం చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్, అధికారంలోకి వచ్చాక మోసం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు.సీఎం రేవంత్‌రెడ్డి సహా మంత్రులెవరూ పట్టించుకోవడంలేదని వాపోయారు. ఈ సందర్భంగా హరీశ్ మాట్లాడుతూ ఉత్తరం దిక్కు ట్రిపుల్ ఆర్ బాధితులకు న్యాయం చేస్తామని అసెంబ్లీ ఎన్నికల వేళ భువనగిరి సభలో ప్రియాంకతో ఇప్పించిన హామీని కూడా విస్మరించడం బాధాకరమని చెప్పారు.ఈ విషయంపై సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి, ఎమ్మెల్యేలు కుంభం అనిల్‌కుమార్, రాజగోపాల్‌రెడ్డి స్పందించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ తీరు 'ఓడ దాటేదాకా ఓడ మల్లన్న..ఓడ దాటినంక బోడ మల్లన్న' చందంగా ఉన్నదని ఎద్దేవా చేశారు. ట్రిపుల్ ఆర్ ఉత్తర భాగాన 40 కిలోమీటర్లకు బదులు 28 కిలోమీటర్లతో జంక్షన్ ఏర్పాటు చేయడం, 78 ఎకరాల్లో ఉన్న జంక్షన్ రింగురోడ్డును 184 ఎకరాలకు పెంచడంతో చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు.మున్సిపాలిటీ రెండుగా చీలిపోతుందని చెప్పారు. రైతులు రెండు పంటలు పండే భూములు, విలువైన ప్లాట్లు కోల్పోవాల్సి వస్తుందని వాపోయారు. బాధితులకు ప్రభుత్వం తక్కువ పరిహారం ఇస్తున్నదని విమర్శించారు. ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్చాలని అప్పటి ఎంపీ, ప్రస్తుత మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి రాయగిరి, చౌటుప్పల్ రైతులతో కలిసి ధర్నాలు చేశారని గుర్తుచేశారు. కానీ అధికారం రాగానే అదే రైతులను మోసం చేస్తున్నారని మండిపడ్డారు.కోమటిరెడ్డికి మతిమరుపు ఎక్కువైంది..'కోమటిరెడ్డికి కొంతకాలంగా మతిమరుపు ఎక్కువైనట్టున్నది..ఆయన ఇచ్చిన హామీల వీడియోలు పంపుతున్నా..చూసుకోండి' అంటూ చురకలంటించారు. 'కోమటిరెడ్డి.. ఇప్పటికైనా స్పందించు..ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్పించి నల్లగొండ వాసులకు న్యాయం చేస్తావా? లేదంటే చరిత్ర హీనుడిగా మిగిలిపోదల్చుకున్నావా? తేల్చుకోవాలని సూచించారు.దక్షిణాన ట్రిపుల్ ఆర్‌కు ఏ విధంగానైతే 40 కిలోమీటర్లను పరిగణనలోకి తీసుకున్నారో, ఉత్తర దిక్కున కూడా 40 కిలోమీటర్లను పరిగణనలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్ ఎన్నికల ముందు ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్చుతామని హామీ ఇచ్చిన సీఎం రేవంత్, ఇప్పుడు పోలీసు బలగాల మధ్య సర్వే చేయించి బాధిత రైతులతో దుర్మార్గంగా ఒప్పంద పత్రాల మీద సంతకాలు పెట్టించారని ధ్వజమెత్తారు.'ఎన్నికల ముందు ఓ మాట? ఎధికారంలోకి వచ్చాక మరో మాటనా? ఇదెక్కడి న్యాయం' అని ప్రశ్నించారు. ఫార్మాసిటీ విషయంలోనూ ఇదేవిధంగా మాట మార్చారని విమర్శించారు. 'మాట మార్చడమే మీ విధానామా? మభ్యపెట్టడమే కాంగ్రెస్ పద్ధతా?' అని నిలదీశారు. పరిహారం ఇవ్వాలని ప్రశ్నించిన ట్రిపుల్ ఆర్ బాధిత రైతులపై ప్రభుత్వం కర్కశంగా వ్యవహరిస్తూ మానసిక క్షోభకు గురిచేస్తున్నదని చెప్పారు. ప్రియాంక గాంధీ చొరవ చూపి ట్రిపుల్ ఆర్ బాధితుల సమస్యలు పరిష్కరించేలా సీఎం రేవంత్‌రెడ్డికి, మంత్రి కోమటిరెడ్డికి ఆదేశాలివ్వాలని హరీశ్ విజ్ఞప్తిచేశారు. ఇప్పటికైనా కాంగ్రెస్ సర్కారు కళ్లు తెరిచి ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

# గవర్నర్‌తో మంత్రి సీతక్క భేటీ



**శాసనసభ /హైదరాబాద్ :** ములుగును మున్సిపాలిటీగా మార్చే బిల్లు ఆమోదానికి కృషి చేయాలని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను మంత్రి సీతక్క కోరారు.ఈ మేరకు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు పటేల్‌తో కలిసి రాజ్‌భవన్‌లో గవర్నర్‌తో మంగళవారం భేటీ అయి వినతి పత్రం సమర్పించారు. ములుగును మున్సిపాలిటీగా మారుస్తూ 2022లో బీఆర్ఎస్ ప్రభుత్వం అసెంబ్లీలో బిల్లు పాస్ చేసింది. సాంకేతిక సమస్యలతో అది అమలుకు నోచుకోలేదు. జీహెచ్ఎంసీ చట్ట సవరణల బిల్లులోనే ములుగు మున్సిపాలిటీ అంశాన్ని చేర్చారు. జీహెచ్ఎంసీలో కో ఆప్షన్ సభ్యుల సంఖ్యను 5 నుంచి 9కి, మైనార్టీ కోఆప్షన్ సభ్యుల సంఖ్య 2 నుంచి 5కు పెంచుతూ చట్టసవరణ చేశారు.అదే బిల్లులో ములుగు మున్సిపాలిటీ అంశం ఉండటంతో బిల్లుకు అప్పటి గవర్నర్ తమిళి సై సౌందర రాజన్ ఆమోదం తెలపలేదు. ఆ తర్వాత రాష్ట్రపతి కార్యాలయానికి బిల్లు పంపారు. దీంతో అప్పటి నుంచి బిల్లు పెండింగ్‌లోనే ఉన్నది. ఆ బిల్లును ఆమోదించేలా చొరవ చూపాలని గవర్నర్‌కు మంత్రి సీతక విజ్ఞప్తి చేశారు. పెండింగ్ బిల్లును రీకాల్ చేసి ములుగును మున్సిపాలిటీగా మారుస్తూ కొత్త బిల్లును వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశపెట్టేలా కసరత్తు చేస్తున్నామని మంత్రి చెప్పారు. గిరిజన ప్రాంతాల ప్రత్యేక పాలనాధికారిగా ఆదిలాబాద్‌లో పర్యటించాలని కోరగా గవర్నర్ సానుకూలంగా స్పందించినట్టు మంత్రి తెలిపారు. ములుగులో ఓ గ్రామాన్ని దత్తత తీసుకునే ఆలోచనలో గవర్నర్ ఉన్నారని, గ్రామాల జాబితా పంపామని వివరించారు.


# దేశ వ్యతిరేక శక్తులతో రాహుల్ దోస్తీ: కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



**శాసనసభ /హైదరాబాద్ :** దేశ వ్యతిరేక శక్తులతో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ దోస్తీ కొనసాగిస్తున్నారని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి విమర్శలు చేశారు.ప్రజాస్వామ్య దేవాలయమైన పార్లమెంట్ ను, స్పీకర్ వ్యవస్థను రాహుల్ అగౌరవ పరుస్తున్నారని మంగళవారం ఒక ప్రకటనలో ఫైరయ్యారు. సుప్రీంకోర్టు, ఎన్నికల సంఘం వంటి రాజ్యాంగబద్ధ సంస్థలను అగౌరవపరచడం, ఇండియన్ ఆర్మీ లాంటి సున్నితమైన వ్యవస్థపై ప్రశ్నలను లేవనెత్తడం, దేశ వ్యతిరేక శక్తులతో దోస్తీ చేయడం, ఓట్ల కోసం కులాలు, మతాల మధ్య విభేదాలు సృష్టించడం, దేశ ప్రధానిపై, కేంద్ర ప్రభుత్వంపై ఆధారరహిత విమర్శలు చేయడం.. రాహుల్ గాంధీకి నిత్యకృత్యమైందని కిషన్ రెడ్డి ధ్వజమెత్తారు. కాశ్మీర్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రధానమంత్రి మోడీపై రాహుల్ గాంధీ చేసిన అర్థరహిత వ్యాఖ్యలపై కిషన్ రెడ్డి ఫైరయ్యారు. ప్రధాని మోడీకి ఆత్మవిశ్వాసం తగ్గిందని, తమ కారణంగానే అది జరిగిందని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని, మోడీపై 140 కోట్ల మంది ప్రజల విశ్వాసం ఉందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు.కాంగ్రెస్.. గత మూడు ఎన్నికల్లో సాధించిన సీట్ల సంఖ్యను కలుపుకున్నా.. బీజేపీ గెలిచిన సీట్ల కంటే తక్కువేనని చురకలంటించారు. 2024 ఎన్నికల్లో వారి కూటమి మొత్తం కలిసి గెలిచిన సీట్ల కంటే బీజేపీయే ఎక్కువ సీట్లు గెలిచిందన్నారు. 60 ఏండ్లు అధికారంలో ఉన్న పార్టీ వరుసగా మూడుసార్లు డబుల్ డిజిట్ కే పరిమితమైందని ఎద్దేవా చేశారు. అయినా రాహుల్ గాంధీ మాత్రం యథేచ్ఛగా అబద్ధాలు ఆడుతూ.. అర్థంలేని విమర్శలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. మోడీ ఆత్మవిశ్వాసం తగ్గిందా, లేక మరింత దృఢమైందా అనే అంశంపై తమకు రాహుల్ సర్టిఫికెట్ అవసరం లేదని విరుచుకుపడ్డారు. జమ్మూ కాశ్మీర్ ఎన్నికల్లో విజయంపై నమ్మకం లేకనే రాహుల్ దేశ వ్యతిరేక వ్యాఖ్యలు చేస్తున్నారని విరుచుకుపడ్డారు. 20 ఏండ్లుగా ప్రధాని పీఠంపై కూర్చోవాలని రాహుల్ పగటి కలలు కంటున్నారని, వరుసగా 3 లోక్ సభ ఎన్నికల్లో ఓడిపోయి, ఆత్మ విశ్వాసం సన్నగిల్లి, ఈర్ష్యతో చతికిలపడి, 10 ఏళ్ల తర్వాత కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్ష నేత అర్హత పొంది.. ఉబ్బితబ్బిబ్బయిపోతున్నాడని కిషన్ రెడ్డి సెటైర్లు వేశారు.

# ఆ 3 రాష్ట్ర రోడ్లను హైవేలు చెయ్యండి

- వికారాబాద్‌లో రహదారుల అభివృద్ధికి నిధులివ్వండి..
- కేంద్ర మంత్రి గడ్కరీకి స్పీకర్ గడ్డం ప్రసాద్ విజ్ఞప్తి'8 ఎన్‌హెచ్ 63 విస్తరణకు



**శాసనసభ / హైదరాబాద్:** వికారాబాద్ నియోజకవర్గం మీదుగా వెళ్లే మూడు 'రాష్ట్ర రహదారులను' జాతీయ రహదారులుగా అప్‌గ్రేడ్ చేయాలని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కోరారు. అలాగే, వికారాబాద్ నియోజకవర్గంలోని మరో ఏడు రహదారుల అభివృద్ధికి నిధులు మం జూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కేంద్ర మంత్రిని ఢిల్లీలో మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. కోకాపేట్ ఓఆర్ఆర్ జంక్షన్–శంకర్‌ప ల్లి–మోమిన్‌పేట్–మర్పల్లి–బుదేరా రోడ్డు, తాండూరు–పెద్దేముల్–కోట్‌పల్లి–మోమిన్‌పేట్–సదాశివపేట రోడ్డు, వికారాబాద్–మోమిన్‌పేట్ రోడ్లను హైవేలుగా అభివృద్ధి చే యాలని విన్నవించారు. అలాగే, సెంట్రల్ రోడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్స్ పథకం(సీఆర్ఐఎఫ్) కింద తాండూరు– ధారూరు రోడ్డుకు రూ.45 కోట్లు, కొత్తగడి–బంట్వారం రోడ్డుకు రూ.50 కోట్లు, కేసారం–తొరమామిడి రోడ్డుకు రూ.60కోట్లు, వికారాబాద్– ధారూరు రైల్వేస్టేషన్ రోడ్డుకు రూ.55 కోట్లు, బషీరాబాద్–మైల్వార్ రోడ్డుకు రూ.35 కోట్లు, మారేపల్లి–మదనాంతపూర్ రోడ్డుకు రూ.40 కోట్లు, పీడబ్ల్యూడీ రోడ్డు–రాంపల్లి–బంట్వారం రోడ్డుకు రూ.30 కోట్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. కాగా, ఎన్‌హెచ్– 63 విస్తరణ, కొత్త రహదారి నిర్మాణానికి కేంద్ర ఉపరితల రవాణా శాఖ రూ. 100 కోట్లు మంజూరు చేసిందని పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ, చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి తెలిపారు. కేంద్ర మంత్రి గడ్కరీని కలిసిన అనంతరం వారు మీడియాతో మాట్లాడారు. మరోపక్క, ఢిల్లీ పర్యటనలో ఉన్న స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు.

# అక్టోబరు 9న సింగరేణి కార్మికులకు బోనస్




**కొత్తగూడెం / శాసనసభ :** సింగరేణి కార్మికులకు ఇటీవలే ప్రకటించిన లాభాల బోన్‌సలో 33% వాటాను వచ్చే అక్టోబరు 9న చెల్లించడానికి యాజమాన్యం ఏర్పాట్లు చేస్తోంది.దీనిపై మంగళవారం అమెరికా నుంచి ఆ సంస్థ సీఎం డీ ఎన్.బలరామ్ వర్చువల్ విధానంలో సమీక్ష చేశారు. సంస్థలో పనిచేస్తున్న సుమారు 42 వేల మంది అధికారులు, కార్మికులకు ఈ లాభాల వాటాను పంపిణీ చేయనున్నారు. గత ఆర్థిక సంవత్సరంలో వారు పనిచేసిన పని దినాల సంఖ్యను పరిగణనలోకి తీసుకొని బోనస్ చెల్లిస్తారు. సగటున ఒక్కొక్కరికీ రూ.1.90 లక్షల దాకా చేతికి అందనుంది. తొలిసారిగా దాదాపు 25 వేలమంది కాంట్రాక్టు ఉద్యోగులకూ లాభాల వాటా బోనస్ చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో అందుకు అనుగుణంగా విధి విధానాలను రూపొందించాలని సీఎండీ ఆదేశించారు.ఈ ఏడాది కూడా దసరా పండుగ అడ్వాన్స్‌ను సింగరేణి ఉద్యోగులకు చెల్లించాలని సీఎండీ ఆదేశించారు. దీంతో ఒక్కొక్కరికి రూ. 25 వేల పండుగ అడ్వాన్స్ చెల్లించనున్నారు. కాగా, సింగరేణికి రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలో అద్భుతమైన ఫలితాలు వచ్చాయని కనీస వేతన చట్టం బోర్డు చైర్మ న్ జనక్‌ప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ నేత లు కేటీఆర్, హరీశ్ రావు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బోనస్ కాదు బోగస్ ప్రభుత్వం అనడంపై మండిపడ్డారు.

# సెప్టెంబర్ 25 న.. పెన్షనర్ల దేశవ్యాప్త రాష్ట్ర స్థాయి మహా ధర్నాలు




**శాసనసభ /హైదరాబాద్ :** కేంద్ర ప్రభుత్వం ఉద్యోగ, పెన్షనర్ల వ్యతిరేక విధానాలను విడనాడాలని, 8 వ కేంద్ర పే కమీషన్ వెంటనే ఏర్పాటు చేయాలని, వైద్య సౌకర్యాలలో కోత విధింపును నిరసిస్తూ ఆరోగ్య పథకాలను మెరుగు పర్చాలని తదితర పెండింగ్ లో ఉన్న డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ..హైదరాబాద్ కోఠీ ఉమెన్స్ కాలేజీ ఎదురుగా ఉన్న నిర్మాణ్ భవన్ (కేంద్రీయ సదన్, సుల్తాన్ బజార్) వద్ద బుధవారం ఉదయం 10 గంటల నుంచి జరిగే ధర్నాలో కేంద్ర ప్రభుత్వ పెన్షనర్ల తో పాటు బీఎస్ఎన్ఎల్ తదితర రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొంటారని టాప్రా నాయకులు ఎన్.సోమయ్య తెలిపారు. విశాఖపట్నం జీవీఎంసీ ఆఫీసు ఎదురుగా గాంధీ విగ్రహం వద్ద ఉదయం 9 గంటల నుంచి జరుగు భారీ ధర్నాలో రైల్వే, డిఫెన్స్ తదితర కేంద్ర పెన్షనర్లు పాల్గొంటారని పెన్షనర్ల నాయకులు ఎం.చంద్రశేఖర రావు పేర్కొన్నారు.ఉద్యోగుల, పెన్షనర్ల న్యాయబద్ధమైన కోర్కెలన్నింటినీ పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో తిరస్కరించినందున, కోర్టు తీర్పులను ఖాతరు చేయనందున, పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ సిఫార్సులను కూడా అంగీకరించనందున ఆందోళనా కార్యక్రమాలను దశల వారీగా ఐక్యంగా తీవ్రతరం చేస్తామని వి.కృష్ణ మోహన్ ప్రభుత్వాన్ని ఈ సందర్భంగా హెచ్చరించారు.



## విడాకుల రూమర్లకు ఐశ్వర్య చెక్ పెట్టారా..?

నటి ఐశ్వర్యారాయ్ వ్యవహారం మరోసారి ఇంటర్నెట్‌లో దుమారం రేపింది. లోరియల్ ప్యారిస్ ఫ్యాషన్ వీక్ 2024కి ముందు ప్యారిస్‌లో ఒక పబ్లిక్ ఈవెంట్‌కు హాజరైనప్పుడు ఐశ్వర్య వేలికి ఉంగరంతో ఒంటరిగా హాజరైంది.అయితే వెడ్డింగ్ ఉంగరంకావడంతో తమ విడాకుల రూమర్లకు ఐశ్వర్య చెక్ పెట్టిందని భావిస్తున్నారు. చాలా కాలం తర్వాత ఐశ్వర్య వేలికి ఉంగరం చూసిన ఈ జంట చివరకు తమ సమస్యలను పరిష్కరించుకున్నారని చర్చించుకుంటున్నారు. అయితే మరికొందరు ఐశ్వర్య వేలికి ఉన్నది పెళ్లి ఉంగరం కాదని, పెళ్లయిన మహిళలు, ప్రధానంగా మంగళూరు వాసులు ధరించే సాంస్కృతిక ప్రాముఖ్యత కలిగిన ఉంగరం అని చెప్తున్నారు. ఈ గాసిప్స్‌పై ఐశ్వర్య లేదా అభిషేక్ క్లారిటీ ఇచ్చేవరకు ఈ ఊహాగానాలకు తెరపడే అవకాశం లేదు.కానీ అభిషేక్‌తో కలిసి ఐశ్వర్య కనిపించి చాలా కాలమైంది. దీంతో వీరిమధ్య సంబంధంపై పుకార్లు, ఊహాగానాలకు వచ్చాయి. అనంత్-రాధిక వివాహానికి ఇతర కుటుంబసభ్యులతో కాకుండా ఐశ్వర్య, ఆమె కుమార్తె ఆరాధ్యతో రావడంతో ఇద్దరి మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయని భావించారు. అధికారికంగా ఈ జంట ఎప్పుడూ చెప్పనప్పటికీ.. వీరి వ్యవహారశైలి వల్ల గాసిప్స్ పుట్టుకొస్తున్నాయి

## తమ్ముడి వ్యాఖ్యలకు సూర్య ప్రాయశ్చిత్త దీక్ష




తమ్ముడు కార్తీ చేసిన వ్యాఖ్యలకు తాను బాధపడుతున్నానని, తాను కూడా మూడు రోజుల పాటు దీక్ష చేస్తానని తమిళ సినీ హీరో సూర్య ప్రకటించారు. ఈ మేరకు పవన్ కల్యాణ్ కు ట్యాగ్ చేస్తూ ఆయన ట్వీట్ చేశారు.తాను తమ్ముడు చేసిన వ్యాఖ్యలకు బాధపడుతున్నానని, తాను రేపటి నుంచి మూడు రోజుల పాటు దీక్ష చేస్తున్నానని, పవన్ కల్యాణ్ కు సారీ చెప్పారు. తమ్ముడు అలా అని ఉండాల్సింది కాదన్నారు.కార్తీ క్షమాపణలు...ఒక సినిమా ప్రమోషన్ లో భాగంగా యాంకర్ అడుగుతూ లడ్డూ కావాలా నాయనా? అంటూ అనగా హీరో కార్తి లడ్డూ గురించి ఇప్పుడు ఎందుకు లెండి? అది సెన్సిటివ్ ఇష్యూ అని నవ్వేశారు. దానిని జనసేన అధినేత పవన్ కల్యాణ్ తప్పుపట్టారు. సినిమా ఫంక్షన్లలో కూడా తిరుమల లడ్డూను కించపర్చేలా మాట్లాడటం సరికాదని అనడంతో సూర్యతో పాటు కార్తీ కూడా క్షమాపణలు చెప్పారు.

## 'థగ్ లైఫ్' స్ట్రీమింగ్ హక్కులను భారీ మొత్తానికి సొంతం చేసుకున్న నెట్‌ఫ్లిక్స్



మణిరత్నం మరియు కమల్ హాసన్ యొక్క అత్యంత అంచనాల ప్రాజెక్ట్ 'థగ్ లైఫ్' ఐకానిక్ చిత్రం నాయకన్ తర్వాత వారి కలయికను సూచించే పీరియాడికల్ యాక్షన్ డ్రామా.ఈ చిత్రంలో సిలంబరసన్ టీఆర్ కీలక పాత్రలో నటిస్తుండగా, త్రిష కృష్ణన్ కథానాయికగా నటిస్తుంది. అత్యంత భారీ బడ్జెట్ తో తెరకెక్కుతున్న ఈ చిత్రం షూటింగ్ ని పూర్తి చేసుకుంది. ఒక ముఖ్యమైన పరిణామంలో, నెట్‌ఫ్లిక్స్ థగ్ లైఫ్ స్ట్రీమింగ్ హక్కులను భారీ 150 కోట్లకు దక్కించుకుంది. ఈ గణనీయమైన ఒప్పందం ప్రాజెక్ట్ యొక్క సామర్థ్యాన్ని మరియు నిరీక్షణను నొక్కి చెబుతుంది.ఈ సినిమాలో శింబు, అలీ ఫజల్, పంకజ్ త్రిపాఠి, అశోక్ సెల్వన్, నాజర్, ఢిల్లీ గణేష్, అభిరామి, ఐశ్వర్య లక్ష్మి, సన్యా మల్హోత్రా, జోజు జార్జ్, జిషు సేన్‌గుప్తా, రోహిత్ సరాఫ్, వైయాపురి మరియు ఇతరులు కీలక పాత్రల్లో నటించారు. సాంకేతిక బృందంలో ఫోటోగ్రఫీ డైరెక్టర్‌గా రవి కె చంద్రన్, ఎడిటర్‌గా ఎ శ్రీకర్ ప్రసాద్ మరియు యాక్షన్ కొరియోగ్రఫీని అన్బరివు ద్వయం నిర్వహిస్తున్నారు. మద్రాస్ టాకీస్ మరియు ఆర్‌కెఎఫ్ఐ సంయుక్తంగా నిర్మించిన థగ్ లైఫ్ తమిళ చిత్రసీమలో అత్యంత అంచనాలున్న ప్రాజెక్ట్‌లలో ఒకటి. మణిరత్నం మాస్టర్ డైరెక్షన్, ఏఆర్ రెహమాన్ ఆకట్టుకునే సంగీతం, కమల్ హాసన్ ఇన్వాల్వ్‌మెంట్‌తో ఈ సినిమా ల్యాండ్‌మార్క్ ప్రాజెక్ట్ అవుతుందని అంచనా వేస్తున్నారు. ఈ సినిమాకి ఎఆర్ రెహమాన్ సంగీతం సమకూర్చారు.

## అందుకే అప్పుడు టెన్షన్ పడ్డా.. వారితో పోల్చుకోను




'యానిమల్' సినిమాలో నటించి విశేష క్రేజ్ సొంతం చేసుకుంది త్రిప్తి డిమ్రీ. తన అందచందాలతో యూత్ ఆడియన్స్‌ను కట్టిపడేసింది.ఇటీవల 'బ్యాడ్ న్యూజ్'తో వినోదం పంచిన ఆమె త్వరలో మరోసారి ప్రేక్షకుల ముందుకు రానుంది. రాజ్ కుమార్‌రావ్ సరసన నటించిన 'విక్కీ విద్యా కా వో వాలా వీడియో' అక్టోబరు 11న విడుదల కానుంది. ఈ సందర్భంగా పాల్గొన్న ఓ ఇంటర్వ్యూలో తనకు డ్యాన్స్ ఇష్టమని తెలిపింది. ఇప్పటి వరకూ డ్యాన్స్ నంబర్ చేయలేదనే లోటు 'మేరే మెహబూబ్' (విద్యా కా వో వాలా వీడియోలోని పాట) తీర్చిందని చెప్పింది. ఆ పాట చిత్రీకరణ జ్ఞాపకాలు గుర్తుచేసుకుంది."మేరే మెహబూబ్.. నాకెంతో ప్రత్యేకం. దానికి సచిన్- జిగర్ సంగీతం అందించగా శిల్పా రావ్, సచెత్ టాండన్ ఆలపించారు. గణేశ్ ఆచార్య కొరియోగ్రఫీ చేశారు. అంతకుమించి ఏం కావాలి? డ్యాన్స్ ప్రతిభ నిరూపించే తొలి పాట కావడంతో ముందుగా కాస్త టెన్షన్ పడ్డా. గణేశ్ ఆచార్య, ఆయన టీమ్ సహకారంతో తేలిగ్గా పూర్తిచేశా. 'దేని గురించీ ఆలోచించకుండా పాటను ఆస్వాదిస్తూ నటించు' అని నన్ను ప్రోత్సహించారు. హిట్ సాంగ్ 'టిప్ టిప్ బర్‌సా పానీ' (మోహ్రా సినిమాలోని సాంగ్.. దానినే 'సూర్యవంశీ'లో రీమిక్స్ చేశారు) చూస్తూ 'మేరే మెహబూబ్'కు రిహార్సల్ చేసేదాన్ని. వాటిలో నటించిన రవీనా టాండన్, కత్రినా కైఫ్ అంత గొప్ప డ్యాన్సర్‌ని కాదు. అందుకే వారితో పోల్చుకోను. మాధురీ దీక్షిత్ డ్యాన్స్‌కు నేను పెద్ద అభిమానిని. ఆమె నటించిన అన్ని పాటలకు నేను డ్యాన్స్ చేశా" అని పేర్కొంది.



## ప్రిన్స్ లుక్‌కు సోషల్ మీడియా షేక్

సాధారణంగా లు సెట్స్‌పై లేకపోతే..ఎంత పెద్ద హీరో అయినా సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో ఉండటం కష్టమైపోతుంది.కానీ మహేష్ బాబు లెక్కలు మాత్రం మరోలా ఉంటాయి.చేసినా.. చేయకపోయినా ఎప్పుడూ ట్రెండింగ్‌లోనే ఉంటారు సూపర్ స్టార్.తాజాగా మరోసారి నేషనల్ వైడ్ హాట్ టాపిక్ అయ్యారు మహేష్. ఎందుకో తెలుసా..?చూసేయండి మరీ.. సాధారణంగా లు సెట్స్‌పై లేకపోతే..ఎంత పెద్ద హీరో అయినా సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో ఉండటం కష్టమైపోతుంది. కానీ మహేష్ బాబు లెక్కలు మాత్రం మరోలా ఉంటాయి. చేసినా.. చేయకపోయినా ఎప్పుడూ ట్రెండింగ్‌లోనే ఉంటారు సూపర్ స్టార్.తాజాగా మరోసారి నేషనల్ వైడ్ హాట్ టాపిక్ అయ్యారు మహేష్. ఎందుకో తెలుసా..?చూసేయండిమరీ..నిజంగానే మగవాడి అందం మీద పాట ఉంటే ఇలాగే ఉంటుందేమో..? ఎప్పటికప్పుడు ట్రెండీగా కనిపించడంలో అందరికంటే ముందుంటారు మహేష్ బాబు. ఇప్పుడూ ఇదే జరిగింది. తాజాగా సూపర్ స్టార్ న్యూ లుక్ వైరల్ అవుతుంది.

# రెండే రెండు నిమిషాల్లో టికెట్లన్నీ హాంఫట్.. దేవర క్రేజ్ మామూలుగా లేదు




జూనియర్ ఎన్టీఆర్ నటించిన దేవర మూవీ టికెట్ల అమ్మకాలు తెలుగు రాష్ట్రాల్లో మొదలైన విషయం తెలుసు కదా. ఈ టికెట్లు హాట్ కేకుల్లా అమ్ముడైపోతున్నాయి.ట్రైలర్ రిలీజ్ కు ముందే నార్త్ అమెరికాలో అన్ని రికార్డులు తిరగరాసిన ఈ మూవీ.. ఇప్పుడు ఇక్కడ కూడా అదే చేస్తోంది. హైదరాబాద్ లోని ఏఎంబీ సినిమాస్ లో రెండే నిమిషాల్లో టికెట్లన్నీ అమ్ముడైపోవడం గమనార్హం.

### దేవర టికెట్లకు ఫుల్ డిమాండ్

దేవర మూవీ శుక్రవారం (సెప్టెంబర్ 27) రిలీజ్ కానున్న విషయం తెలుసు కదా. దీనికోసం సోమవారం (సెప్టెంబర్ 23) టికెట్ల అమ్మకాలు మొదలయ్యాయి. సహజంగానే తొలి రోజు చాలా వరకూ మల్టీప్లెక్స్ లలో పదుల సంఖ్యలో షోలు ఏర్పాటు చేస్తున్నారు. హైదరాబాద్ లోని ఏఎంబీ సినిమాస్ లో అయితే తొలి రోజు మొత్తంగా 27 షోలు ఉన్నాయి.ఉదయం 7.55 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకూ మొత్తంగా 27 షోలు వేస్తుండం విశేషం. అయితే ఇన్ని షోలు ఉన్నా, టికెట్ల ధరలను భారీగా పెంచినా కూడా కేవలం రెండే నిమిషాల్లో ఈ టికెట్లన్నీ అమ్ముడైపోయాయంటే నమ్మగలరా? దేవర మూవీకి క్రేజ్ ఏ స్థాయిలో ఉందో ఇదొక్క ఉదాహరణతోనే మనకు అర్థమైపోతోంది.

### టికెట్ల ధర పెంపు.. అర్ధరాత్రి షోలు

దేవర మూవీ టికెట్ల ధరలను పెంచడానికి రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు అనుమతిచ్చిన విషయం తెలిసిందే. తెలంగాణలోని మల్టీప్లెక్స్ లలో అయితే గరిష్ఠంగా ఈ ధరలు రూ.413 వరకూ ఉన్నాయి. ఏఎంబీ సినిమాస్ లోనూ రూ.400 నుంచి రూ.500 మధ్య టికెట్ల ధరలను చూపిస్తోంది. ఈ టికెట్లు కూడా ఎగబడి కొనేస్తున్నారు. తొలి రోజు మాత్రమే ఈ ధరలు ఉంటాయి.ఇక సింగిల్ స్క్రీన్లలో అయితే గరిష్ఠంగా రూ.297 వరకూ ఉండటానికి అనుమతి ఇచ్చారు. అంతేకాకుండా అర్ధరాత్రి ఒంటి గంటకే షోలు ఏర్పాటు చేయనున్నారు. తెలంగాణలో మొత్తంగా 29 థియేటర్లు ఈ అర్ధరాత్రి షోలు వేయనున్నాయి. ఇక రోజుకు ఆరు షోలు వేసుకునేందుకు కూడా ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇవన్నీ చూస్తుంటే తొలి రోజే దేవర మూవీ బాక్సాఫీస్ రికార్డులను తిరగరాయడం ఖాయంగా కనిపిస్తోంది.ఆర్ఆర్ఆర్ తర్వాత రెండున్నరేళ్లకు మరోసారి సిల్వర్ స్క్రీన్ పై జూనియర్ ఎన్టీఆర్ తన నట విశ్వరూపాన్ని ఈ దేవర ద్వారా చూపించబోతున్నాడు. మూవీ నుంచి రిలీజైన రెండు ట్రైలర్లు అసలు సినిమా ఎలా ఉండబోతోందో కళ్లకు కట్టాయి. ఈ మూవీ ప్రీరిలీజ్ ఈవెంట్ రద్దయినా.. సినిమాకు అభిమానుల్లో ఉన్న క్రేజ్ మాత్రం అసలు తగ్గలేదు.అటు జూనియర్ ఎన్టీఆర్ ఈ మూవీ ప్రమోషన్లలో కోసం యూఎస్ వెళ్లాడు. అక్కడ లాస్ ఏంజెల్స్ లోని ఫిల్మ్ ఫెస్టివల్లో దేవర వరల్డ్ ప్రీమియర్ షోని అతడు చూడనున్నాడు. ఈ సినిమాలో జాన్వీ కపూర్, సైఫ్ అలీ ఖాన్ లాంటి బాలీవుడ్ నటీనటులు నటించిన విషయం తెలిసిందే.

## 'అప్పటి వరకూ వీడ్కోలు పలకొద్దు'. రోహిత్, కోహ్లీలకు కపిల్ సూచన



భారత జట్టుకు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ లు గత పదేండ్లకు పైగా సేవలందిస్తున్నారు. కెప్టెన్‌గా, ఆటగాడిగా తమదైన ముద్ర వేస్తూ జట్టు విజయాల్లో భాగమవుతున్నారు.టీమిండియాకు కుడి, ఎడమ భుజాలుగా నిలుస్తున్న ఈ ఇద్దరి కెరీర్ దగ్గర పడింది. టీ20 వరల్డ్ కప్ తర్వాత పొట్టి ఫార్మాట్‌కు వీడ్కోలు పలికారు. కొత్తతరం దూసుకొస్తుండడంతో వన్డే, టెస్టులకు కూడా ఈ దిగ్గజ ఆటగాళ్లు త్వరలోనే గుడ్ బై చెప్పేసే అవకాశముంది. ఈ నేపథ్యంలో వరల్డ్ కప్ హీరో కపిల్ దేవ్ 'రోకో' భవితవ్యంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు.'రోహిత్, కోహ్లీలు ఎప్పటివరకైతే ఫిట్‌గా ఉంటారో అప్పటివరకూ ఆడాలి. ఆటను ఆస్వాదిస్తున్నంత కాలం ఇద్దరూ క్రికెట్‌ను వీడొద్దు. రవి శాస్త్రి చిన్న వయసులోనే ఆటకు అల్విదా చెప్పాడు. అయితే.. సచిన్ టెండూల్కర్ సుదీర్ఘ కెరీర్‌ను ఎంజాయ్ చేశాడు. అయితే.. ఇప్పుడు రిటైర్మెంట్ అనేది వ్యక్తిగత నిర్ణయం అయింది. నా దృష్టిలో మాత్రం ఆటగాళ్లు ఫిట్‌గా ఉన్నంత కాలం ఆడొచ్చు' అని కపిల్ అభిప్రాయపడ్డాడు.అంతేకాదు 26 ఏండ్ల నుంచి 34 ఏండ్ల మధ్య ప్రతి క్రికెటర్ అత్యద్భుతంగా సాగుతుంది. ఆ తర్వాత ఫిట్‌నెస్ కీలక పాత్ర పోషిస్తుంది. ఎక్కువ రోజులు ఆడాలంటే ఫిట్‌గా ఉండడం తప్పనిసరి' అని కపిల్ వెల్లడించాడు. ప్రస్తుతం కోహ్లీకి 35 ఏండ్లుకాగా కెప్టెన్ హిట్‌మ్యాన్‌కు 37 ఏండ్లు.ప్రస్తుతం ఆస్ట్రేలియాతో బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ.. ఆపై ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ఫైనల్, చాంపియన్స్ ట్రోఫీ విజయంపై ఈ ఇద్దరూ కన్నేశారు. రోహిత్, కోహ్లీలు ఇంకో మూడేండ్లు ఫిట్‌గా ఉంటే వన్డే వరల్డ్ కప్ ఆడే అవకాశముంది.లార్డ్స్‌లో వరల్డ్ కప్ అందుకుంటూ..టీమిండియా గొప్ప సారథుల్లో కపిల్ దేవ్ పేరు అజరామరంగా నిలిచిపోతుంది. 1983లో భారత్‌ను విశ్వ విజేతగా నిలిపిన కపిల్ 131 టెస్టులు, 225 వన్డేలు ఆడాడు. పేస్ ఆల్‌రౌండర్‌గా రాణించిన ఈ హర్యానా హరికేన్ సుదీర్ఘ ఫార్మాట్‌లో 5,248 పరుగులు, వన్డేల్లో 3,783 రన్స్ సాధించి.. వరుసగా 434, 253 వికెట్లు పడగొట్టడు. ప్రపంచ క్రికెట్‌లో భారత దేశ పేరును గట్టిగా వినిపించిన కపిల్ దేవ్ జీవితకథ ఆధారంగా బాలీవుడ్‌లో 83 పేరుతో సినిమా కూడా వచ్చింది.

## 'మోర్నీకి గౌరవమే ఇవ్వలేదు.. తామే గొప్ప అని మా బౌలర్ల భావన'



భారత బౌలింగ్ కోచ్‌గా దక్షిణాఫ్రికా మాజీ పేసర్ మోర్నీ మోర్కెల్ బాధ్యతలు స్వీకరించిన సంగతి తెలిసిందే. బంగ్లాదేశ్‌తో తొలి టెస్టుకు ముందు టీమ్ఇండియాతో కలిసిపోయాడు.తన తొలి అసైన్‌మెంట్‌ను అద్భుత విజయంతో ప్రారంభించాడు. అంతకుముందు పాకిస్థాన్ బౌలింగ్ కోచ్‌గా బాధ్యతలు నిర్వర్తించిన మోర్నీని తమ దేశం బౌలర్లే సరిగ్గా గౌరవించలేదని ఆ జట్టు మాజీ క్రికెటర్ బసిత్ అలీ వ్యాఖ్యానించాడు. క్రికెట్ కంటే కూడా తామే గొప్ప అని తమ బౌలర్లు భావించేవారని పేర్కొన్నాడు."గత కొన్నేళ్లుగా మా జట్టు బౌలింగ్ పరిస్థితి దారుణంగా మారింది. దీనికి కారణం మా బౌలర్ల అహం. క్రికెట్ కంటే తామే గొప్ప అనే భావన వారిలో వచ్చింది. అసలు మోర్నీ మోర్కెల్‌ను చిన్నచూపు చూసి పక్కన పెట్టేశారు. ఇప్పుడు మోర్కెల్ భారత జట్టు కోచ్‌గా వచ్చాడు. ఇక్కడ టీమ్ఇండియా, పాక్ ఆటగాళ్ల మైండ్‌సెట్ అత్యంత కీలకం. మా దేశంలో ఆడిన బంగ్లా జట్టుకు.. భారత్‌తో తలపడుతున్న బంగ్లాదేశ్‌కు పెద్ద తేడా ఏం లేదు. పాక్ ఒత్తిడికి గురై వెనకడుగు వేసింది. అందుకే, బంగ్లా వైట్‌వాష్ చేయగలిగింది. భారత ఆటగాళ్ల మైండ్‌సెట్ విభిన్నం. వారి ఆలోచన వేరు" అని బసిత్ వ్యాఖ్యానించాడు.వన్డే ప్రపంచ కప్, టీ20 ప్రపంచకప్, బంగ్లాదేశ్‌తో టెస్టు సిరీస్‌లో ఘోర ప్రదర్శనతో పాక్ జట్టుపై తీవ్ర విమర్శలు రేగాయి. అయితే, భవిష్యత్తులో తమ టీమ్‌ను మూడు ఫార్మాట్లలో మెరుగ్గా రాణించేలా తీర్చిదిద్దుతామని ప్రధాన కోచ్ జాసెన్ గిలెస్పీ తెలిపాడు. పీసీబీ ఛైర్మన్ మోహ్‌సిన్ నక్వీ నాయకత్వంలో వ్యూహాత్మక క్యాంప్ జరిగింది. దానికి సంబంధించిన వివరాలను ప్రధాన కోచ్ వెల్లడించాడు. "ప్రతిఒక్కరూ జట్టు విజయాల కోసం శ్రమిస్తాం. ఆటగాళ్లకు సహాయం అందించడానికే మేం ఉన్నాం. కోచింగ్ బాధ్యతలు కొత్తగా చేపట్టాం. ఇప్పుడు ప్లేయర్ల సమస్యలను వినడం మా కర్తవ్యం. పాకిస్థాన్ ఆటగాళ్లు తమ దేశానికి ఆడటంపై ఉన్న గర్వం, వారు ఎలా ప్రేరణగా ఉండాలనుకుంటున్నారో మాకు స్పష్టంగా అర్థమైంది. ఆటగాళ్లంతా చాలా జాగ్రత్తగా ఉన్నారు. బాగా రాణించాలనే తపనతో ఉన్నారు. వారికి సహకారం అందించేందుకు ఎల్లవేళలా మేం సిద్ధంగా ఉంటాం" అని గిలెస్పీ తెలిపాడు.

## చదువురాని దద్దమ్మలు! పిల్లలకి ఏం నేర్పిస్తున్నారు... చెన్నై టెస్టు విజయం తర్వాత పాకిస్తాన్ మాజీ క్రికెటర్ ఫైర్...



'బుమ్రా 5 వికెట్లు తీశాడు, అశ్విన్ 6 వికెట్లు, రవీంద్ర జడేజా 5 వికెట్లు తీశారు. సిరాజ్, ఆకాశ్ దీప్ కూడా రెండేసి వికెట్లు తీశారు. మొత్తంగా 20 వికెట్లు ఈజీగా తీసేశారు. బౌలింగ్ చేసిన ప్రతీ బౌలర్‌కి వికెట్ దక్కింది. భారత జట్టు, చెన్నై టెస్టులో కేవలం ఇద్దరు స్పిన్నర్లతో బరిలో దిగింది. చెన్నై స్పిన్ పిచ్ అని అందరికీ తెలుసు. అయినా ఇద్దరు స్పిన్నర్లతో బరిలో దిగారంటే.. బంగ్లా బ్యాటర్లు, స్పిన్ బాగా ఆడతారని వాళ్లకి తెలుసు. అందుకే ఫాస్ట్ బౌలర్లను ప్రయోగించారు. మూడో రోజు స్పిన్నర్లు తమ పని తాము కానిచ్చారు..భారత జట్టు కోరుకున్నట్టుగా పిచ్ అనుకూలించింది. కాబట్టి పిచ్ క్యూరేటర్‌కి కూడా క్రెడిట్ ఇవ్వాలి. టెస్టు మ్యాచ్‌కి తగ్గట్టుగా పిచ్‌ని రూపొందించారు. ఇక్కడ అలా కాదు.. మన దగ్గర ఉన్నవాళ్లంతా చదువురాని దద్దమ్మలు, తెలివి తక్కువ మూరు□లు.. ఎందుకంటే పిచ్ ఎలా స్పందిస్తుందో కూడా వీళ్లకు తెలీదు..నాకు కోపంతో బూతులు వచ్చేస్తున్నాయి.. ఎందుకంటే పాకిస్తాన్‌లో పిచ్‌కి అస్సలు విలువ ఇవ్వరు. పీసీబీ ఏది పిచ్ అంటే దాని మీదే ఆడతారు. ఇదా మీరు పిల్లలకి నేర్పేది. భావితరం కూడా ఇలాగే అనుకుంటారు. విదేశాలకు వెళ్లినప్పుడు గుండు సున్నాలు చుడతారు..పిచ్‌ని సరిగ్గా అర్థం చేసుకోగలిగితే సగం సమస్యలు తీరిపోయినట్టే.. సునీల్ గవాస్కర్, జావెద్ మియాందాద్ వంటి దిగ్గజాలను అడిగితే స్పిన్‌ని ఎలా చదవాలో తెలుస్తుంది.. కానీ మనవాళ్లకి వాళ్లు చెప్పేది కూడా అర్థం కాదు. ఇదే ఇక్కడొచ్చిన సమస్య..' అంటూ కామెంట్ చేశాడు పాకిస్తాన్ మాజీ క్రికెటర్ బాసిత్ ఆలీ...